పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంగా కృషి

- శరవేగంగా ధ్రువపత్రాల పంపిణీ
- లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కాలేరు సభలో ధ్రువపత్రాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్


ఏడిదలో సర్టిఫికెట్ల నమోదును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ భవాని, సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, కాలేరు ఉప సర్పంచ్ పలివెల పద్మామణి, ఎంపీటీసీ సభ్యులు టేకి శ్రీసత్యమంజు, పలివెల మధు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు అన్నారు. కాలేరులో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ దాయం కావేరి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు గ్రామ ప్రయోజనాలు, సాంకేతిక సమస్యలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు అబ్బు, ఎంపీపీ సత్యవేణి మాట్లాడుతూ సామాన్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాయవరం: పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకు వచ్చారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వెంటూరు, వి.సావరం గ్రామాల్లో శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచులు వాసంశెట్టి వెంకట్రావు, కాకి కృష్ణవేణి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. అర్హులైన దరఖాస్తుదారులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, నున్న కృష్ణప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ, ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేందుకు అమలు చేస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక 23వ వార్డు కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి, 24వ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి అధ్యక్షతన ఆయా వార్డుల్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు ముక్కా దాలయ్య, యర్రగుంట అయ్యప్ప, లేగా వెంకన్న, బొద్దపాటి మంగరాజు పాల్గొన్నారు.

ఏడిదలో..

ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని ప్రారంభించారు. అనంతరం సర్టిఫికెట్ల నమోదును వారిద్దరూ పరిశీలించారు. ఎంపీడీఓ ఐ రాజు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, బూరిగ జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు


మతుకుమిల్లిలో మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- మతుకుమిల్లి గడప గడపకూ..

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారు ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని మతుకుమిల్లిలో శుక్రవారం మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. గ్రామానికి వచ్చిన మంత్రి వేణుగోపాలకృష్ణకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి గతంలో ఎన్నడు లేనంతగా ముఖ్యమంత్రి జగనన్న కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మఒడి, సున్నావడ్డీ తదితర పథకాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి వేణు మహిళలకు సూచించారు. భారత దేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. సగటున ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు మంత్రి వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, సర్పంచ్ పెట్టా వీరనాయుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, పార్టీ నాయకులు టేకుమూడి దుర్గారావు, కాకి కృష్ణ, కాకి శ్రీనివాసరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- అమ్మఒడి నమూనా చెక్ అందజేత


దంగేరులో తల్లిదండ్రులకు అమ్మఒడి నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ఒక కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నా, సమాజంలో గౌరవ మర్యాదలు పెరిగి అభివృద్ధి చెందాలన్నా అది ఒక్క విద్య వల్లే సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని దంగేరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. గతంలో తల్లిదండ్రులు స్కూల్‌కు పంపాలంటే పిల్లల పుస్తకాలు, బ్యాగ్‌లు, దుస్తులు ఇలా ఎంతో ఖర్చుతో కూడుకుందనే భయంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపకుండా పనుల్లోకి పంపేవారన్నారు. నేడ జగనన్న ఇచ్చిన భరోసాతో ఫీజులు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్య, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రోజుకో రకంతో జగనన్న గోరుముద్ద, రాగి జావ, చిక్కీలు, పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, సాక్సులు, దుస్తులు ఇలా అన్ని సదుపాయాలు ఉచితంగా కల్పించారన్నారు. అన్నిటి కన్నా ముఖ్యంగా అమ్మఒడి పథకం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతలు అమ్మఒడి సాయం అందుకున్నారని తెలిపారు. అంటే ఒక్కో విద్యార్థి ఇప్పటి వరకూ రూ.60 వేలు లబ్ధి పొందారన్నారు. నాడు నేడు ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఓ కార్పొరేట్ విదా సంస్థలను మించి తీర్చిదిద్దారన్నారు. కె.గంగవరం మండలంలో 26 గ్రామాలకుగాను 5149 మంది విద్యార్థులు అమ్మఒడి పథకాన్ని అర్హులయ్యారని వీరి తల్లిదండ్రుల ఖాతాల్లో ఈ విడతగా రూ.7 కోట్ల 72 లక్షల 35 వేలు జమ చేయడం జరిగిందన్నారు. సభ అనంతరం అమ్మఒడికి సంబంధించిన చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన అందించారు. ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీఓ ఓబులనేని శ్రీవరలక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, పార్టీ నాయకులు పంపన సుబ్బారావు, పిల్లి కళ్యాణ్, కాదా గోవిందు, ఎంఈఓ నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం అమ్మ ఒడి


విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి నమూనా చెక్కు అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

రాయవరం: అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు వరమని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం అమ్మఒడి మండల స్థాయి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ మండలంలో 4,796 మంది విద్యార్థులకు ప్రతి విద్యార్థికి రూ.13 వేలు వంతున రూ.6,23,48,000 తల్లుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. అలాగే టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్ ఖాతాల్లో రూ.2వేల వంతున 95.92 లక్షలు జమ చేసిందన్నారు. సమావేశంలో అమ్మ ఒడి నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేశారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, హెచ్ఎం వి.శాంతిసునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు

- మండపేట చైర్‌పర్సన్ దుర్గారాణి
- 8వ వార్డులో పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా పట్టణ పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వార్డు పర్యటనల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, 8వ వార్డు కౌన్సిలర్ మండపల్లి రవికుమార్‌తో కలిసి ఆమె ఆ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. పారిశుధ్యంపై వారు చెప్పిన సమస్యలపై కమిషనర్ రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో పట్టణ ప్రజలు కార్మికులకు సహకరించాలని కోరారు. చెత్తను డ్రైన్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా తడి పొడి చెత్తగా విభజించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు కొల్లి వరలక్ష్మి, మండపల్లి రుద్రకాంత్, గోరు అన్నవరం, కొడమంచిలి భాస్కరరావు, తాడి రామారావు, పెంకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


వేడుకల్లో మాట్లాడుతున్న జయరాజు

మండపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 29వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం మండపేటలో ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు ఆధ్వర్యంలో గొల్లపుంత కాలనీలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసి దండోరా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కృష్ణా టాకీస్ వద్ద జెండాను ఆవిష్కరించి అందరికి స్వీట్లు పంచారు. ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, దళితుల అభ్యున్నతి లక్ష్యంగా మందా కృష్ణమాదిగ స్థాపించిన ఎమ్మార్పీఎస్ గత 29 ఏళ్లుగా ఎన్నో ప్రజా ఉద్యమాలు ద్వారా బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమానికి ఎనలేని కృషి చేసిందన్నారు. కౌన్సిలర్ సవరపు సతీష్, సంఘ నాయకులు డోకబుర్ర రాజుబాబు, గాలింకి నాగేశ్వరరావు, మండపల్లి చంద్రశేఖర్, చాపల వీరబాబు, శ్యామ్, గుడిమెట్ల శ్రీను, కోడి చిన్ని, పైడిమళ్ల సతీష్, పెందుర్తి కిషోర్ పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.25 వేల విరాళం

ఆలమూరు: శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆలమూరులో నిర్మిస్తున్న కాపు కళ్యాణ మండపానికి రూ.25 వేలు విరాళం అందింది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అద్దరి శ్రీనివాసరావు ఈ మేరకు అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు శుక్రవారం ఆ విరాళాన్ని అందజేశారు. కాపు కల్యాణ మండపం అభివృద్ధి కోసం విరివిగా విరాళాలు అందజేస్తున్న దాతలను ప్రభాకర్‌రావు అభినందించారు. మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, గ్రామ కాపు సంఘం అధ్యక్షుడు చల్లా నానాజీ, ఉపసర్పంచ్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా విజయ కనకదుర్గాదేవి


కొత్తపేట: స్థానిక దేవీ సెంటర్‌లో వేంచేసిన కనకదుర్గమ్మ వారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు పుల్లేటికుర్తి కృష్ణశర్మ వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంట రుణాలపై అవగాహన


నల్లూరులో కౌలు రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: రైతులు కౌలుదారులకు బ్యాంకుల ద్వారా అందే రుణాలు, అందుకు పాటించాల్సిన నియమాలపై అవకాహన అవసరమని ఆలమూరు ఏడీఏ కాకి నాగేశ్వరరావు అన్నారు. కౌలు రైతులకు రుణాల మంజూరుపై నల్లూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసే నిమత్తం జిల్లాలో పలు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ అధ్యక్షతన గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు బి.యామిని ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో ఏఓ కేవీఎస్‌రమేష్ కుమార్ మాట్లాడారు. సాగుసలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ వల్లూరి సూర్య వెంకట కృష్ణారావు, డీసీసీబీ అంగర శాఖ మేనేజర్ దేవి, వీఆర్వో రామారావు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

గుర్తింపు లేని స్కూల్‌ను రద్దు చేయాలి


ద్రాక్షారామ శ్రీచైతన్య స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ను రద్దు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. పాఠశాల యాజమాన్యం ఎటువంటి అనుమతుల లేకుండా గత 5 నెలలుగా ప్రచారాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఓపెన్ పర్మిషన్ తెచ్చుకుని కొనసాగిస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 8, 9 తరగతులకు కనీసం ఓపెన్ పర్మిషన్ కూడా లేదని మండిపడ్డారు. విద్యాహక్కు 2009 ప్రకారం ఈ టెక్నో, స్కూల్, గ్రీన్ ఫీల్డ్, టెక్నో స్కూలు వంటి పదాలు ప్రచారాల్లో వాడకూడదన్నారు. గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్యపై చర్యలు తీసుకుని పాఠశాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, ప్రజా సంఘాల నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఎ.కృష్ణ, సీహెచ్ రాజారెడ్డి, కె.సురేష్, సిరిచందన, వై.షీబా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పంటల బీమా పరిహారం విడుదల

రాయవరం: మండలంలో 2022 ఖరీఫ్ పంటకు సంబంధించి పంట బీమాను శనివారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నట్లు రాయవరం ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాయవరం మండలంలోని వెదురుపాక, వి.సావరం, రాయవరం, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, నదురుబాద గ్రామాలకు సంబంధించి 6,688 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. వారందరి బ్యాంకు ఖాతాలకు రూ.5.90 కోట్ల బీమా సొమ్ము నేరుగా జమ కానుందని ఏవో తెలిపారు.

శాకంబరిగా సత్తెమ్మ తల్లి


చినద్వారపూడిలో శాకంబరిగా సత్తెమ్మ అమ్మవారు

మండపేట: ఆషాఢ మాసంలోని శుక్రవారం సందర్భంగా మండలంలోని చిన ద్వారపూడిలో ప్రసిద్ధి చెందిన సత్తెమ్మ తల్లి వారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వంద కేజీలకు పైగా వివిధ రకాల కూరగాయలతో ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని అలంకరించారు. గ్రామస్తులు, ప్రయాణికులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

షార్ట్ సర్క్యూట్‌తో దెబ్బతిన్న గృహోపకరణాలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన మామిడి రాంబాబు ఇంట్లో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ క్రమంలో బాధితుడికి శుక్రవారం ప్రభుత్వ సాయంగా 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. గురువారం రాత్రి సంభవించిన షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్తు ఉపకరణాలు, మంచం దెబ్బతిన్నాయి. తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆదేశాలపై కార్యదర్శి కామేశ్వరరావు, వీఆర్వోలు పెద్దింశెట్టి నాగమణి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్ చేతులు మీదుగా బాధితుడుకి బియ్యాన్ని అందజేశారు.

ఎంపీటీసీకి మంత్రి పరామర్శ

కె.గంగవరం: మండలంలోని దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్‌కు శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ పరామర్శించారు. ఎంపీటీసీ లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన స్వగృహానికి మంత్రి చెల్లుబోయిన వేణు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, అనుసూరి సాయి, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, కాదా గోవిందు, పిల్లి కల్యాణ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అందుబాటులో పాముకాటు వ్యాక్సిన్

కపిలేశ్వరపురం: స్థానిక గొడవర్తి సత్యనారాయణమూర్తి ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పాము కాటుకి ఇచ్చే యాంటీ వీనమ్ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. పాముకాటుకు గురై అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు తమ ఆసుపత్రిని సంప్రదించవచ్చని తెలిపారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో 10 మందికి గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో శుక్రవారం ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన ప్రతి ఒక్కరినీ కరవడానికి ప్రయత్నించింది. దీనితో 10 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరిని తొడలపైన, నడుముపైన కరిచింది. కొందరు గోళ్ల గీసుకోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా ద్రాక్షారామ పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం చేరుకోగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్.ప్రశాంతి, డాక్టర్ సందీప్‌నాయుడు, డాక్టర్ అలేఖ్యలు ఏఆర్‌వీ ఇంజక్షన్‌లు ఇచ్చారు.

వరకట్న వేధింపులపై కేసు

మండపేట: అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నట్టు వివాహిత ఇచిమచన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక కొండపల్లి వారి వీధికి చెందిన జి. జ్యోతిప్రియ, రాజ్‌కుమార్‌లు 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో కట్నకానుకలు ఇవ్వగా అదనపు కట్నం కోసం కొంత కాలంగా భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నట్టు బాధితురాలు జ్యోతిప్రియ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె. అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంకు చెందిన ఒక యువతి చదువు కోసం కళాశాలకు వెళ్లి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన పెంకే చిరంజీవి బైక్ ఎక్కమని అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ స్పెషల్ తెలుగు, బీకామ్ జనరల్, బీకామ్ కంప్యూటర్స్, బీఎస్సీ ఆక్వాకల్చర్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రక్షిత తాగునీటితో ఆరోగ్య రక్షణ



తాతపూడి సచివాలయంలో తాగునీటి పరీక్ష చేస్తున్న ఆనంద్ కుమార్

కపిలేశ్వరపురం: సురక్షిత తాగునీటి వాడకంతో ఆరోగ్య రక్షణ సాధ్యమని తాతపూడి గ్రామ కార్యదర్శి పి.మోహన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్ అన్నారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి ప్రాధాన్యతపై శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులకు తాగునీటి పరీక్ష చేసే విధానంపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి


ఎయిడ్స్‌పై ఏఎన్ఎంలు, ఆశాలకు అవగాహన కల్పిస్తున్న నందివర్ధిని

కాజులూరు: ప్రపంచ దేశాల్లో మానవాళి మనుగడకు పెనుభూతంగా మారిన ఎయిడ్స్ మహమ్మారిని నిరోధించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధిని అన్నారు. శుక్రవారం ఆర్యావటం పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంలు, ఆశా వలంటీర్లు, మహిళలకు బీమాబాయి మహిళామండలి సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. నందివర్ధిని మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని అవగాహణతో మసలితే ప్రతి ఒక్కరూ వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఎయిడ్స్ రోగులను ఆదరించి వారికి సక్రమంగా మందులూ, పోషకాహారం అందిస్తే జీవితకాలమంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.మణిరత్నం, సంస్థ ఏరియా కోర్డినేటర్ డి.అర్జునరావు, నూకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.